క్లుప్తంగా

ఎమ్మెల్యేకు మాజీమంత్రి పరామర్శ



హన్మంతరావు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న మాజీ మంత్రి దయాకర్‌రావు

జగిత్యాల: జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కు మార్ తండ్రి హన్మంతరావు అనారోగ్యంతో మరణించగా, మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆదివారం ఎమ్మెల్యేను కలిసి పరామర్శించారు.

ఈ- అభ్యాస్ ఐఐటీ అవార్డులకు విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్, ప్రిన్సిపాల్

కథలాపూర్: మండలకేంద్రంలోని మాస్టో హైస్కూల్‌లోని 7, 8, 9 తరగతులకు చెందిన ఆరుగురు విద్యార్థులు ఈ- అభ్యాస్ ఐఐటీ అకాడమీ రాష్ట్రస్థాయి అవార్డులకు ఎంపికైనట్లు కరస్పాండెంట్ ఆకుల రాజేశ్ ఆదివారం తెలిపారు. పాఠశాలకు చెందిన మల్యాల మిథున్, తునికి జశ్వంత్, కారంగుల స్మరణ, వల్లకొండ రోహిత్, ఏలేటి పార్వతి, కాల్వ శ్రీనిధి అనే విద్యార్థులు అవార్డులకు ఎంపికయ్యారన్నారు. ప్రతిభ చాటిన విద్యార్థులను ప్రిన్సిపాల్ రంజిత్, ఉపాధ్యాయులు అభినందించారు.

శాంతి స్వరూప్‌కు నివాళి



నివాళి అర్పిస్తున్న జర్నలిస్టులు

కోరుట్ల: తొలి తెలుగు న్యూస్ రీడర్ శాంతి స్వరూప్ మృతిపై సంతాపం వ్యక్తం చేస్తూ శనివారం రాత్రి కోరుట్ల ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ దూరదర్శన్ న్యూస్ యాంకర్‌గా ప్రజలకు స్పష్టంగా వార్తలు చేరవేయడంలో ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షులు శేఖర్, ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్, పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



కృష్ణారావును సన్మానించిన క్రీడాకారులు

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలోని మినీ స్టేడియంలో ఆదివారం ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు, కొమొరెడ్డి విజయ్ ఆజాద్ ప్రారంభించి మాట్లాడారు. యువకులు క్రీడాల్లో రాణించాలని, క్రీడల్లో గెలుపోటములు సహజం అని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూడ శ్రీకాంత్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ కాస సంజీవ్, ఏబీవైఎం జిల్లా యూత్ అధ్యక్షుడు రెబ్బటి రాజశేఖర్ యాదవ్, ప్రమోద్, కూన రాకేశ్, వెంకట్‌రెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

బుగ్గారం: మండలంలో ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకుంటూ అప్రమత్తంగా ఉండాలని బుగ్గారం ఎస్సై శ్రీధర్‌రెడ్డి సూచించారు. దొంగతనాల నివారణకు పోలీసులకు సహకరించాలని కోరుతూ పలు సూచనలు జారీ చేశారు. వేసవికాలం కావడంతో చాలామంది గ్రామాలలో ఆరుబయట నిద్రిస్తూ ఉంటారని, ఇదే అదనుగా దొంగలు పడే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో ఆరు బయట నిద్రించేవారు నగలు,డబ్బును జాగ్రత్త దాచుకోవాలని తెలిపారు. తెలియని వ్యక్తులు ఎవరైనా గ్రామాలలో సంచరిస్తే వెంటనే 100 నెంబర్‌కు కాల్ చేయాలని సూచించారు. పాఠశాలలకు సెలవుల నేపథ్యంలో చిన్నారులు బావుల్లో ఈతకు వెళ్లి ప్రమాదాల బారిన పడుతున్నారని, పిల్లలను తల్లిదండ్రులు ఎల్లప్పుడూ గమనిస్తూ ఉండాలన్నారు. ఊర్లకు వెళ్లేవారు తమ బంధువులకు,పోలీసులకు సమాచారం ఇచ్చి వెళ్లాలన్నారు. దొంగతనాలను, నేరాలను నియంత్రించడానికి గస్తీని పెంచామన్నారు. గ్రామాల్లో సీసీ కెమెరాలను విరివిగా ఏర్పాటు చేయడానికి ప్రజలు ముందుకు రావాలన్నారు. ప్రజలు తమ సలహాలు,సూచనలు పాటించి పోలీసు శాఖకు సహకరించాలన్నారు.

బస్టాండ్ ఉన్నా.. బస్సులు రావు

- నిరుపయోగంగా కొడిమ్యాల బస్టాండ్
- బ్రిడ్జి మరమ్మతులు చేయడంలో ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యం
- ప్రయాణికులకు ఇబ్బందులు



బస్సు కోసం రోడ్డుపైనే ఎదురుచూస్తున్న ప్రయాణికులు

కొండగట్టు: కొడిమ్యాల మండల కేంద్రంలోని బస్టాండ్ బస్సులు రాక నిరుపయోగంగా మారింది. బస్టాండ్ ఉన్నా బస్సులు మాత్రం అక్కడ ఆగడం లేదు. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు మీదనే బస్సులు ఆగడం, అక్కడే నిలబడి ఉన్న ప్రయాణికులను తీసుకోని వెళ్తున్నారు. దీంతో ఎండాకాలం ఎండకు, వానకాలం వానకు ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్న పట్టించుకునే నాథుడే కరువయ్యాడు.

కుంగిన బ్రిడ్జి మరమ్మతులు చేయడంలో అధికారుల నిర్లక్ష్యం

కొడిమ్యాల బస్టాండ్ వద్దకు నిత్యం జగిత్యాల,పూడూర్,వేములవాడ కొండగట్టు, జెఎన్‌టీయూ కళాశాలకు వెళ్లే ప్రయాణికులు విద్యార్థులు వస్తుంటారు. బస్టాండ్‌లోకి బస్సులు రాక ఏళ్లు గడుస్తోంది. గతంలో బస్టాండ్ పరిస్థితి అధ్వానంగా మారడంతో వెంటనే అప్పటి కొడిమ్యాల సర్పంచ్ ఏలేటి మమత సొంత ఖర్చులతో రంగులు వేయించి, జీపీ నిధులతో మొరం పోయించి బాగు చేయించారు. అనంతరం కురిసిన వర్షాలకు బస్టాండ్‌లో నుంచి బస్సులు బయటకు వెళ్లే దారిలో ఉన్న బ్రిడ్జి కుంగిపోయింది. వెంటనే సంబంధిత ఆర్టీసీ అధికారులు మరమ్మతులు చేయించాల్సింది పోయి, నేటికి కూడా పట్టించుకున్న పాపాన పోలేదు. మరి ఆర్టీసీ బస్టాండ్ సరిహద్దులు ఏమాత్రం మిస్ అవకుండా ఉండేందుకు లక్షలాది రూపాయలతో బస్టాండ్ చుట్టూ కంపౌండ్ వాల్ ఏర్పాటు చేశారు. కానీ బ్రిడ్జి మరమ్మతులు చేపట్టడం లేదు. దీంతో నిత్యం వచ్చే బస్సులు రోడ్ మీదనే ఆగి,అక్కడి నుంచే ప్రయాణికులను బస్సుల్లో ఎక్కించుకోని వెళ్తున్నాయి. దీంతో బస్టాండ్ కాస్తా మేకలు,కుక్కలు ఆవాసంగా తయారైంది. ఇక ప్రైవేట్ వాహనాల పార్కింగ్‌కు బస్టాండ్ అడ్డాగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్టాండ్‌ను వినియోగంలోకి తీసుకురావాలని ప్రయాణికులు కోరుతున్నారు.



బస్టాండ్‌లో మేకలు, కుక్కలు

బస్టాండ్‌ను అందుబాటులోకి తీసుకురావాలి



బస్టాండ్ అధ్వానంగా ఉంటే నా సొంతఖర్చులతో రంగులు వేయించాను. అలాగే బ్రిడ్జి సైతం పూర్తి చేయాలని ఆర్టీసీ అధికారులకు తెలిపినా పట్టించుకోలేదు. వారి ఆస్తి కాపాడుకునేందుకు బస్టాండ్ చుట్టూ గోడను నిర్మించారు. అదే డబ్బుతో బ్రిడ్జి మరమ్మతులు పూర్తి చేస్తే బస్సులు లోపలికి వచ్చేవి. బస్టాండ్‌లోకి బస్సులు వచ్చేలా ఆర్టీసీ అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలి.

– ఏలేటి మమత నర్సింహరెడ్డి, మాజీ సర్పంచ్, కొడిమ్యాల

త్వరలో మరమ్మతు చేయిస్తాం



బ్రిడ్జి మరమ్మతుల కోసం ఎస్టిమేషన్ పూర్తి చేసి పై అధికారులకు పంపించాం. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాగానే బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేసి బస్టాండ్‌ను వాడకంలోకి తీసుకువచ్చి ప్రయాణికులకు సౌకర్యాం కల్పిస్తాం.

– మురళీకృష్ణ, వేములవాడ డిపో మేనేజర్

బావుల్లో అడుగంటిన నీరు

- ఎండుతున్న పొలాలు..
- కాపాడుకోవడానికి రైతుల పాట్లు
- శాశ్వత పరిష్కారం చూపాలంటున్న రైతులు..



సారంగాపూర్ వ్యవసాయ బావిలో అడుగంటిన నీరు   ఎండిన పొలం(ఇన్‌సెట్‌లో)

సారంగాపూర్: మండలంలోని బట్టపల్లి, పోతారం, సారంగాపూర్ ఈ మూడు గ్రామాల్లోని వ్యవసాయ బావుల్లో నీరు అడుగంటి పోయింది. దీనితో బావుల కింద సాగుచేసిన వరి పొలాలు, ఇతర పంటలకు సాగునీరు అందించడం కష్టంగా మారింది. జనవరిలో 8 నుంచి 10 గంటల పాటు సాగునీరు అందించిన బావులు ఇప్పుడు కనీసం గంట కూడ అందించడం లేదు. భూగర్భజలాలు భారీగా పడిపోయాయి. నీరు రాకపోవడంతో పొలాల్లో రైతులు నానా పాట్లు పడుతున్నారు. మరో 15 రోజుల పాటు సాగునీరు అందించాల్సి ఉంది. వ్యవసాయ బావిలో ఉన్న నీటిని పొదుపుగా వాడుతూ మడి మడికి పైపులు వేస్తూ సాగునీరు అందిస్తున్నారు. ఒక ఎకరం పొలానికి తడి అందించడానికి కనీసం మూడు నుంచి నాలుగు రోజులు పడుతుందని చెబుతున్నారు. 2023 ఆగస్టులో వర్షాలు పోయిన తరువాత తిరిగి అడపాదడపా వర్షాలు కురిసినా ఈ పరిస్థితి వచ్చేది కాదని రైతులు వాపోతున్నారు.

శాశ్వత పరిష్కారం చూపాలి



ప్రతీ ఏడాది సారంగాపూర్ పడమటి వాడ వైపు ఉన్న 500 ఎకరాలకు యాసంగిలో సాగునీరు అందడం కష్టంగా మారింది. పంటలు ప్రతిసారి ఎండుతున్నాయి. చింతల చెరువులోకి ఎస్సారెస్పీ కాలువ తీసుకురావాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ప్రతిపాదించి, సర్వే పూర్తయింది. చింతల చెరువులోకి వచ్చే ఎస్సారెస్పీ నీటికి సారంగాపూర్ ఇరుకురాళ్ల వద్ద అదనంగా తూము ఏర్పాటు చేసి, బతుకమ్మ కుంటలోకి ఎస్సారెస్పీ నీరు చేర్పితే మా బావుల్లో భూగర్భ జలాలు పెరిగి పంటలు ఎండకుండా పండుతాయి. దీనిపై ప్రభుత్వం ఆలోచన చేయాలి.

– దోసారపు సాయిలు, సారంగాపూర్

కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా జలపతిరెడ్డి



జలపతిరెడ్డికి నియామకం పత్రం ఇస్తున్న నాయకులు

మల్లాపూర్: కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన మాజీ జెడ్పీటీసీ ఎలాల జలపతిరెడ్డిని నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు సుంకెట అన్వేశ్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, కోరుట్ల కాంగ్రెస్ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావుతో కలిసి ఆదివారం జలపతికి రెడ్డికి నియామక పత్రం అందజేశారు. తనపై నమ్మకంతో పదవి కట్టబెట్టిన పార్టీ అధిష్ఠానంతో పాటు జీవన్ రెడ్డి, అన్వేశ్‌రెడ్డి, నర్సింగరావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

వృద్ధాశ్రమానికి విరాళం

జగిత్యాలజోన్: జిల్లా కేంద్రంలోని శివ గాయత్రి అనాథ వృద్ధా శ్రమానికి దాతలు ఆశ్రమ నిర్వాహకుడు సూరజ్ శివశంకర్‌కు ఆదివారం రూ.12 వేల విరాళం అందజేశారు. పట్టణంలోని అంగడి బజార్‌కు చెందిన రిటైర్డ్ హెచ్‌ఎం అలిశెట్టి లక్ష్మన్–గీతారాణి దంపతులు రూ.12 వేల విరాళం అందజేయడంతో పాటు జీవితాంతం వృద్ధాశ్రమానికి సరుకుల నిమిత్తం ప్రతి నెల రూ. 1500 చొప్పున అందిస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో దాతల కుటుంబసభ్యులు సుజన, సుధారాణి, సురేఖ, కవితారాణి, తేజారాణి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మల్యాల: మల్యాల సబ్‌స్టేషన్ పరిధిలోని మల్యాల, ముత్యంపేట, రాజారం, నూకపల్లి గ్రామాల్లో సోమవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈఈ శ్రీనివాస్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

గొల్లపల్లి: మండల కేంద్రంలోని చాణక్య హైస్కూల్‌లో పాఠశాల వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నృత్యాలు, ఆట పాటలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు నిషాంత్ రెడ్డి,కరస్పాండెంట్ మనోహర్ రెడ్డి,ప్రిన్సిపాల్ వొల్లాల నారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

జగిత్యాలటౌన్: జగిత్యాల కొత్త బస్టాండ్ ఆవరణలో భగవాన్ శ్రీసత్యసాయి సేవాసమితి తరపున ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సత్యసాయి సేవాసమితి కన్వీనర్ బట్టు రాజేందర్ ఆదివారం ప్రారంభించారు. అనంతరం రాజేందర్ మాట్లాడుతూ భగవాన్ శ్రీసత్యసాయి బాబా ఆశీస్సులతో ప్రతి ఏడులాగే ఈ ఏడు కూడా ప్రయాణికుల సౌకర్యార్థం ఉచిత చల్లని మినరల్ వాటర్ పంపిణీ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. సత్యసాయి సేవాసమితి ద్వారా తన సేవా కార్యక్రమాలను సమాజంలో అన్ని వర్గాల ప్రజలకు సేవా కార్యక్రమాలు అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సేవాసమితి ప్రతినిదులు కొత్త ప్రతాప్,విద్యాసాగర్, కొత్త వేణుగోపాల్, తాటిపర్తి దశరథరెడ్డి, మహిళా సభ్యులు, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

పీపుల్స్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నరేశ్

వెల్గటూర్ : పీపుల్స్ పార్టీ ఆఫ్ ఇండియా తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎండపల్లి మండలం అంబరిపేటకు చెందిన మోతె నరేశ్‌ను నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు పోతునూరి సత్యనారాయణ తెలిపారు. ఆదివారం నరేశ్‌కు నియామక పత్రం అందజేశారు. తనపై నమ్మకంతో తనకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పదవి అప్పగించడంపై నాయకులకు నరేశ్ కృతజ్ఞతలు తెలిపారు.

బెల్ట్‌షాప్‌పై పోలీసుల దాడి

కథలాపూర్: మండలంలోని పెగ్గెర్లలో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్‌షాపుపై పోలీసులు ఆదివారం దాడులు చేశారు. గ్రామానికి చెందిన మాసం నవీన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నవీన్‌కుమార్ పేర్కొన్నారు. అతని వద్ద ఉన్న రూ. 8 వేలు విలువగల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

నిత్యావసర సరుకులు అందజేత

రాయికల్: పట్టణానికి చెందిన సామాజిక కార్యకర్త కడకుంట్ల జగదీశ్వర్–శ్వేతల వివాహ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం మండలంలోని కైరిగూడెంలోని నిరుపేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. నాయకులు ఎడ్డండి ముత్యంరాజు, సాయి కుమార్, రసూల్, విజయ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

మోడల్‌స్కూల్ ప్రవేశాల పరీక్షకు 37 మంది గైర్హాజరు

కథలాపూర్: మోడల్‌స్కూల్‌లో ప్రవేశాలకు కథలాపూర్‌లో ఆదివారం నిర్వహించిన పరీక్షలకు 37 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్ నరేశ్ తెలిపారు. ఉదయం 6వ తరగతిలో ప్రవేశానికి నిర్వహించిన పరీక్షకు 193 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా.. 176 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం 7, 8, 9, 10 తరగతుల్లో ప్రవేశాలకు నిర్వహించిన పరీక్షకు 124 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా.. 104 మంది హాజరైనట్లు ఆయన పేర్కొన్నారు.

పాఠశాలలో ఇఫ్తార్

రాయికల్: పట్టణంలోని ప్రగతి ఉన్నత పాఠశాలలో ఆదివారం ముస్లింలకు పాఠశాల ఆవరణలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యప్రిన్సిపాల్ బాలెశేఖర్ మాట్లాడుతూ మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్‌విందు అన్నారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ నిఖిల్, ముస్లిం మైనార్టీ అధ్యక్షుడు సోహెల్, నాయకులు పాల్గొన్నారు.

మల్లాపూర్: మండలంలోని సిర్పూర్ జామా మసీదులో ఆదివారం ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు.

మాలసంఘం నూతన కార్యవర్గం



ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

వెల్గటూర్ : ఎండపల్లి గ్రామ మాల సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎండపల్లిలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గౌరి ప్రభాకర్, ఉపాధ్యక్షుడిగా దేవి నర్సయ్య, ప్రధాన కార్యదర్శిగా ఆల్క లచ్చయ్య, కార్యదర్శి అనే శ్రీనివాస్, కోశాధికారిగా అనే మల్లయ్య, కార్యవర్గ సభ్యులుగా దేవి చుక్కయ్య, దేవి భీమయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు ప్రభాకర్ మాట్లాడుతూ సంఘ అభివృద్ధికి కృషి చేస్తానని, తన పైన నమ్మకంతో ఏకగ్రీవంగా తన ఎన్నికకు సహకరించిన మాల సంఘ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో భీమయ్య, కనకయ్య, శంకరయ్య, చిన్నయ్య, ప్రవీణ్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మల్లన్న బోనాలు



మల్యాల: కొత్తపేటలో బోనాలతో తరలివెళ్తున్న మహిళలు

ఇబ్రహీంపట్నం: మండలంలోని ఎర్దండిలో ఆదివారం మల్లన్న జాతర ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లన్న ఆలయంలో స్వామివారి కల్యాణం నిర్వహించారు. అనంతరం గ్రామస్తులు పోతరాజుల విన్యాసాలతో గ్రామం నుంచి బోనాలను ఊరేగింపుగా తీసుకవెళ్లి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కల్లెడ లక్ష్మణ, దాసరి గంగనర్సయ్య, అవుట్ల లక్ష్మణ్, కూన రాకేశ్ గ్రామస్తులు పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం మండలం ఎర్దండిలో ..

ఇంటికో బోనం.. పోచమ్మకు నైవేద్యం

మల్యాల: మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ముత్యాల పోచమ్మ తల్లికి మల్యాల పరిధి కొత్తపేటలోని వివిధ కుల సంఘాల నుంచి ఇంటికో బోనం చొప్పున బోనాలతో ముత్యాల పోచమ్మకు నైవేద్యం సమర్పించారు. డప్పుచప్పుళ్ల మధ్య వందలాదిమంది మహిళలు బోనాలు నెత్తిన ఎత్తుకొని, ఊరేగింపుగా పోచమ్మ ఆలయానికి తరలివెళ్లి, అమ్మవారికి నైవేద్యం సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు.

ఘనంగా మల్లన్న స్వామి బోనాలు

మల్లాపూర్: మండల కేంద్రంలోని మల్లన్నస్వామి ఆలయ వార్షికోత్సవంలో భాగంగా మల్లన్నస్వామికి బోనాలు సమర్పించారు. అంతకముందు ఉత్సవాల్లో భాగంగా కల్యాణ మహోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండల పొలాస సాయిబాబా ఆలయంలో ఉగాది పండగను పురస్కరించుకుని ఆదివారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఆధ్యాత్మికతతోనే క్రమశిక్షణ



ముందస్తు ఉగాది వేడుకల్లో నర్సింగరావు

కోరుట్ల: ఆధ్యాత్మికతతో క్రమశిక్షణ అలవడుతుందని కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. పట్టణంలోని సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ముందస్తు ఉగాది వేడుకల్లో జువ్వాడి నర్సింగరావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సత్య సాయి సేవా సమితి ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు, పట్టణ, మండల కాంగ్రెస్ అధ్యక్షులు తిరుమల గంగాధర్, కొంతం రాజం, సేవా సమితి అధ్యక్షుడు చిదురాల అశోక్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తన్నీరు శ్రీనివాసరావు, కౌన్సిలర్ నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

జువ్వాడికి సన్మానం

పట్టణంలోని బీసీ కాలనీలో ఆదివారం కాంగ్రెస్ నాయకులు జువ్వాడి నర్సింగరావు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీ అభివృద్ధికి నిధులు మంజూరు చేయిస్తామన్నారు. కాలనీలో పోచమ్మ గుడికి నిధులు ఇస్తామన్నారు. ఈ సందర్భంగా బీసీ కాలనీకి చెందిన కాంగ్రెస్ సోషల్ మీడియా ఇన్‌చార్జి వాసం అజయ్, బీసీ కాలనీ ప్రజలు జువ్వాడి నర్సింగరావును ఘనంగా సన్మానించారు.

ఫీజుల దోపిడీ అరికట్టాలి



మాట్లాడుతున్న కుమార్

జగిత్యాల: ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని పీడీఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కుమార్ అన్నారు. ఆదివారం మాట్లాడుతూ ప్రైవేటు కార్పొరేట్ విద్యాసంస్థలు ఎలాంటి అనుమతులు లేకుండా బ్రాంచులు ఏర్పాటు చేసుకుని విద్యార్థుల నుంచి లక్షలాది రూపాయలు ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. విద్యాశాఖ అధికారుల అండదండలతోనే జరుగుతుందని, ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలన్నారు. ప్రభుత్వం అడ్మిషన్ల ప్రక్రియ అనుమతివ్వకముందే అడ్మిషన్లు చేపడుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎస్సీ హాస్టల్ నూతన కమిటీని ఎన్నుకన్నారు. అధ్యక్షురాలిగా శ్రేయ, ప్రధాన కార్యదర్శిగా వైష్ణవి, ఉపాధ్యక్షురాలుగా రజిత, జాయింట్ సెక్రటరీగా ప్రేమలత, కోశాధికారిగా తనుజ నియమితులయ్యారు.



పూర్వ విద్యార్థుల సమ్మేళనం

వెల్గటూర్ : మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో 2005–06 సంవత్సరం పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆదివారం ఒకే చోట కలిసి అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. 'మళ్లీ పోదాం బడికి' అంటూ తాము చదువుకున్న స్కూల్‌లో కార్యక్రమం నిర్వహించుకున్నారు. 18 ఏళ్ల తర్వాత ఒక చోట కలుసుకున్న స్నేహితులు, ఉపాధ్యాయులు ఒకరినొకరు అప్యాయంగా పలకరించుకుని, యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆటపాటలతో రోజంతా ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులంతా ఉన్నత స్థానాల్లో ఉండాలని కోరుకున్నారు.